# ★ అలక ★

అలగటమూ ఒక కళే. అదీ అందరికీ రాదు. అలక నేర్చిన వ్యక్తులు జీవితములో ఎన్నో కార్యాలను సాధించగలరు. అలక అనగానే ఆడవాళ్లు గుర్తుకు వస్తారు. కన్నీరు, అలక ఆడవాళ్ల ఆయుధాలంటుంటారు. ఇందులో కొంత సత్యమువున్నా అందరి ఆడవాళ్ళకు అలక చేతకాదంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు.

వాశిరెడ్డి సీతాదేవి

అలక ముదిరితే మొండిపట్టు, లేక హఠము క్రింద మారుతుంది. దీనివల్ల జీవితములో ఎన్నో అనర్థకాలు సంభవించవచ్చును. అలకకూ, హఠము (మొండిపట్టు)కూ సూక్ష్మమైన భేదమున్నది. దీన్ని తెలుసుకోలేకపోయినందువల్ల దాంపత్యజీవితాల్లో అశాంతి రేకెత్తే అవకాశముంది.

జీవితములో ప్రేమకున్న స్థానమే అలకకూ వుంటుంది. అలకద్వారా ప్రేమ వికసిస్తుంది. అలక ప్రేమలో మాధుర్యాన్నీ, క్రొత్తదనాన్నీ ఉత్పన్నం చేస్తుంది. దీనివల్ల జీవితములో ఓవిధమైన ఆవేదన, ఆ ఆవేదనలో మాధుర్యము కలుగుతాయి. అవిరామ ప్రయాణములో విసుగు చెందిన బాటసారి కొంచెంసేపు ఏ చెట్టుక్రిందనో లేక



నాగపూజ

ఫొటో: డి. భీమారావు—హొలహార్వి.

సత్రంలోనో విశ్రాంతి తీసుకుంటాడు. ప్రేమమార్గంలో అలక ప్రేమజీవులకు ఒక విశ్రాంతిస్థానము. సేదదీరిన బాటసారి మరల నూతనోత్సాహంతో, నూతనశక్తితో ప్రయాణము సాగిస్తాడు.

అలకలో ఒకవైపున అశాంతి, ఆవేదన, అసంతృప్తి వుంటే రెండోవైపున అభిమానంతో కూడిన ఆనందము తీయ్యనికోర్కెలు వుంటాయి. ప్రేమపూర్ణమైన అధికారమే అలక. ఎవరిమీద మనకు ప్రేమ, అధికారము వున్నాయనుకుంటామో, వారిమీదనే అలుగుతాము. పిల్లలనుండి వృద్ధులవరకే కాక పశువుల్లో సైతము యీ అలక కన్పిస్తుంది.

అలకతీర్చేవారూ, అభీష్టాన్ని నెరవేర్చేవారూ వున్నప్పుడే అలగటమంటూ జరుగుతుంది. తన అలకని లక్ష్యపెట్టేవారు లేనప్పుడు అలగటమంత తెలివితక్కువపని వేరేవుండదు. కళ్ళనీళ్ళు తుడిచేవారిముందే ఆకన్నీటికి విలువ వుంటుంది. అలాగే అలక తీర్చేవారూ, ఆ అలక తీరేంతవరకూ అశాంతితో బాధపడేవారూ వున్నప్పుడే ఆ అలకకూ విలువ వుంటుంది.

అలకలు ఎన్నోవిధాలుగా వుంటాయి. కొంతమంది అలిగితే మాట్లాడటము మానివేస్తారు. కొంతమంది ఎవరిమీదనైతే అలక వహించారో వారియడల అయిష్టతను తెలియపరుస్తారు. కొంతమంది వారి సమక్షమునుండి దూరంగా పోతారు. కొంతమంది బహుమతులుగా యివ్వబడిన వస్తువులను తిరిగి యిచ్చివేసి తమ అలకను తెలియపరుస్తారు. ఇంకా కొంతమంది ఆభరణాలను, మంచి వస్త్రాలను త్యజించి, ఏ చింపిరిపాతలో ధరిస్తారు. ఇంకా యింట్లో అలంకరణకు వుంచిన వస్తువులను చిందరవందరగా పడేస్తారు. ఇలాంటి అలక సాధారణంగా ప్రబంధనాయికలలో కన్పిస్తుంది.

తెలివైనవారు యీ ఆయుధాన్ని, ఎప్పుడు, ఎక్కడ, ఎలా వుపయోగించాలో ఆలోచించి మరీ వుపయోగిస్తారు. చీటికి మాటికి అలిగే వారి అలకకు విలువే వుండదు.

అలకలో విరోధభావము వున్నా ఆగ్రహము (మొండిపట్టు) వుండదు. మొండిపట్టు ద్వేషానికీ, అవిశ్వాసానికీ, మనస్పర్థలకూ దారితీస్తుంది. రాజీపడటములోనే అలకరాణిస్తుంది. అందువల్ల, అలిగినవారు సరసం విరసంగా మారకుండా జాగ్రత్తపడాలి.

జీవితాన్నీ, ప్రేమనూ, రసవత్తరం చేయటానికి అలకఅవసరమే. కాని తమ ప్రేమ పాత్రుల ప్రేమను, దౌర్బల్యాన్నీ ఆధారంగా తీసుకొని అనుచితమైన లాభాన్ని పొందటానికి ప్రయత్నించటము చాలా కష్టాలకు దారితీస్తుంది.

శ్రీ కృష్ణుడు పదహారువేల మంది గోపికల్లో, ఏడుగురు భార్యల్లో చూడలేని ఏ ఆకర్షణ సత్యభామలో చూశాడో! చాలామంది సత్యభామ అపురూప సౌందర్యమే అతన్ని ఆకర్షించిందని భ్రమపడతారు. కాని సత్యభామ అలక నేర్చిన అతివ కావటమే అతని ఆకర్షణకు ఆధారభూతమైనది.

ఇంతమంది ప్రియురాండ్ర హృదయాలనుండి అవిరామంగా ప్రవహించే ప్రేమప్రవాహములో! ఉక్కిరి బిక్కిరయే శ్రీ కృష్ణునకు సత్యభామ అలక విశ్రాంతిని యిచ్చేది. గోపికలు ప్రేమించటం మాత్రము నేర్చుకున్నారు. కాని ఆ ప్రేమను పాత పడనీయకుండా మధ్య మధ్య కొత్తదనాన్ని యివ్వగలిగే అలకను నేర్చుకోలేకపోయారు. యీ రహస్యాన్ని తెలుసుకున్న సత్యభామ శ్రీ కృష్ణుని తన వానిగా చేసుకున్నది.

అలాగే అలక నేర్చిన కైకేయికి దశరథుడు దాసుడయాడు. గృహంలో ప్రవేశించి, ప్రవేశించకముందే పరిస్థితిని అర్థం చేసుకున్న దశరథుని హృదయం ఒకవైపు ఏదో అజ్ఞాతభయంతో, రెండోవైపు తియ్యని ఆలోచనలతో (ఆమె అలక ఎలా తీర్చాలా, అనే ఆలోచనలు) నిండిపోతుంది. కాని కైకేయి అలక, హఠముగా మారింది. చివరికి అది ఎన్నికష్టాలకు దారితీసిందో అందరికీ తెలిసిన విషయమే.

అలకద్వారా ఒక్కొక్కప్పుడు గడ్డు సమస్యలుకూడ ఒకదారికొస్తాయి. ఒకోసారి అకారణంగానే ఏ యిద్దరు స్నేహితుల మధ్యనో, ప్రియులమధ్యనో మనస్పర్థలు బయలుదేరి, ఒకరినొకరు విమర్శించుకొనేంతవరకూ, శతృత్వం వహించేంత వరకుకూడ పోతాయి. అలాంటివారికి యీ కళ తెలియదనే చెప్పాలి. ఇలాంటి సమయాల్లో ఒకరు అలిగికొద్దిరోజులు దూరంగా వెళ్ళిపోవటం మంచిది. సావకాశంగా యిద్దరూ ఆలోచించుకొనే అవకాశం దొరుకుతుంది. యీవిధంగా తమతమ లోపాలను అర్థంచేసుకొని, పశ్చాత్తాప పడే అవకాశం దొరుకుతుంది. మరల ఒకరొకరు కలుసుకోవటానికి తహతహ పడతారు. యీ విధంగా, ఒకరినొకరు శతృవులుగా భావించుకోవటం వరకూ పోయినవాళ్లు కూడ, మరల నూతనోత్సాహంతో, ఉద్వేగంతో కలుసుకొనే అవకాశం వుంటుంది.

గృహస్థ జీవితంలో భార్యాభర్తలు రాజీమార్గాన్ని అనుసరించాలి. స్త్రీ, పురుషులు ఒకరినొకరు అర్థం చేసుకొంటూ, ఒకరి లోపాల నొకరు సానుభూతితో సహిస్తూ, తమతమ స్వతంత్ర భావాలను కొంతవరకు అదుపులో పెట్టుకోగలిగినప్పుడే దాంపత్య జీవితము ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా నడవగలదు.

దూరంగా వున్నంతవరకూ ప్రేమగానీ, స్నేహంగానీ సురక్షితంగానే వుంటుంది. కాని దగ్గరకు వచ్చినప్పుడే కొద్దిరోజుల్లోనే పరస్పరాకర్షణ తగ్గటం, ఒకరిని చూస్తే ఒకరికి చిరాకు ప్రారంభమవుతాయి. "టాల్‌స్టాయి" రచించిన నవల, "అన్నా" చదివిన వారికి అన్నా ఏ కారణంగా మానసిక బాధకు గురైందో, చివరకు ఆమె జీవితము దుఃఖాంత మెందుకైయిందో తెలిసివుంటుంది. దీనికంతకు ముఖ్యకారణము అన్నాకు అలగటము తెలియకపోవటమే.

మానవుడు సాధారణంగా తన ప్రేమ పాత్రులైనవారిలో అన్ని సద్గుణాలనీ, మంచితనాన్నీ చూస్తాడు... చూడగోరతాడు. తన ప్రియులు తన అభిరుచులకు అనుకూలంగా వుండాలని కోరటమే మానవునిలోని పెద్ద బలహీనత. దగ్గరకు వచ్చిన కొలది ఒకరి బలహీనతలమీద ఒకరికి అసంతృప్తి, అయిష్టత, పెరుగుతాయి. అలాంటప్పుడు సహనంతో ఆలోచించి, ఉదారభావంతో రాజీపడాలి. అసలు వివాహమే యిద్దరి వ్యక్తులమధ్య కుదిరే రాజీ. దీన్ని మర్చిపోవటంవల్ల గృహము నరకంలాగ తయారవుతుంది.

మైత్రినీ, దాంపత్య జీవితాన్నీ, ప్రేమను దృఢంగా, శాంతంగా, సరసంగా చేసుకోవాలంటే సరసమైన అలక నేర్చుకోవటము ఎంతయినా అవసరము. ★

కావలెను
ఉన్నిశాల్వాలకు ఏజెంట్లు కావలెను. శాంపిల్సు.
వివరములు ఉచితము.
Western Textiles, LUDHIANA (21).

కౌంట్ ఆఫ్ మాంటీక్రిస్టో
రెండు భాగములు
ఒక్కొక్క భాగం
వెల రూ. 3-8-0
పోస్టుఖర్చు ప్రత్యేకం.
ఆంధ్రగ్రంథమాల,
మద్రాసు-1.